మత్స్యకారుల విలవిల

- కడలి పుత్రులపై విపత్తుల పడగ
- అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఎప్పుడూ ఇబ్బందులే..
- వేట సాగితే తప్ప పూట గడవని పరిస్థితులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

సముద్రంలో వేట సాగితే తప్ప పూట గడవని జీవితాలు మత్స్యకారులవి. ప్రకృతి విపత్తుల కారణంగా ఏడాదిలో ఆఖరి మూడు నెలలు వేట సక్రమంగా జరగడం లేదు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపాన్లు, అల్పపీడన పరిస్థితులతో కడలి పుత్రుల జీవనం కష్టతరంగా మారింది. అప్పులతో కుటుంబాలను పోషించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మండలంలో..	
మత్స్యకార గ్రామాలు	: 14
వేటపై ఆధారపడిన కుటుంబాలు	: 4,500


వేట సాగక సామగ్రిని తీరంలో భద్రపర్చుకున్న మత్స్యకారులు

తోటపల్లిగూడూరు: మారిన వాతావరణ పరిస్థితులు మత్స్యకారుల జీవనయానంపై ప్రభావం చూపుతున్నాయి. ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు తీరని వ్యథను మిగులుస్తున్నాయి. గత రెండు నెలలుగా బంగాళాఖాతంలో తరచూ ఏర్పడుతున్న అల్పపీడనాల ప్రభావంతో సముద్రంలో వేట సాగక అనేకమంది మత్స్యకారులు పస్తులతో గడపాల్సి వస్తోంది. వ్యవసాయ రంగం తర్వాత చాలామంది కడలినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వేట లేని సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించకపోతే బతుకుతెరువు కష్టమేనని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని తీర ప్రాంతాలైన కోడూరు, వెంకన్నపాళెం పంచాయతీల్లో 14 మత్స్యకార గ్రామాలున్నాయి. వాటిల్లో దాదాపు 4,500 కుటుంబాలు సముద్రపు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. కొంతకాలంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావంతో సముద్రంలోని మత్స్య సంపద దరికి చేరడం లేదు. దీంతో ఇప్పటివరకు అంతంతమాత్రంగా సాగుతున్న వేట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేలా ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఆ మూడునెలలు తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. అల్పపీడనంతోపాటు పోటు కారణంగా సముద్రం ఉగ్రరూపం దాలుస్తోంది. దీంతో వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు భయపడుతున్నారు. ఒకవేళ ధైర్యం చేసి వేటకు వెళ్లినా చేపలు తదితరాల దొరక్క ఖాళీ పడవులతో తిరిగి రావాల్సి వస్తోంది.


కోడూరు సాగర తీరంలో ఎగసిపడుతున్న అలలు (ఫైల్)

ఇతర పనులకు..

వాతావరణ శాఖ తుపాన్లు, భారీ వర్షాల హెచ్చరికలు ఇచ్చినప్పుడల్లా మత్స్యకారులు వేట సామగ్రి అయిన పడవులు, వలలను తీరంలో కట్టేసి ఇతర పనులను వెతుక్కుంటున్నారు. మరికొందరు మాత్రం అప్పులతో కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తమను ఆదుకోవాలని తీరంలోని వేలాది మంది కడలి పుత్రులు కోరుతున్నారు.

పస్తులతో గడపాల్సి వస్తోంది



కొన్నినెలలుగా సముద్రంలో వేట సక్రమంగా సాగడం లేదు. తరచూ అల్పపీడనాలు ఏర్పడటంతో సముద్రం కసురు మీద ఉంటోంది. ఏ రోజుకారోజు వేట సాగించి జీవిస్తుంటాం. ఈ క్రమంలో రోజుల తరబడి వేట లేకపోవడంతో జీవనం కష్టతరంగా మారుతోంది. పస్తులతో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

– వెంకటేశ్వర్లు, మత్స్యకారుడు, ఈదూరుపట్టపుపాళెం

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రస్తుతం సముద్రంలో వేట సాగించేందుకు వాతావరణం అనుకూలంగా లేదు. అందుకే తప్పని పరిస్థితిల్లో విరామం చెప్పక తప్పలేదు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు మరింతంగా ఇబ్బందులను కలిగిస్తున్నాయి. వేట లేని కాలంలో ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.

– సుధాకర్, మత్స్యకారుడు, ముత్యాలతోపుపట్టపుపాళెం, కోడూరు

క్లుప్తంగా

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



పొదలకూరు: మండలంలోని పులికల్లు, ఊసపల్లి గ్రామాల్లో తహసీల్దార్ బి.శివకృష్ణ శుక్రవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. పులికల్లు గ్రామంలో రెండు, ఊసపల్లి గ్రామంలో రెండు అర్జీలు మాత్రమే అందాయి. సదస్సులకు ఆశించిన స్థాయిలో రైతులు హాజరుకావడం లేదు. అక్టోబర్‌లో సభలు పెట్టడంతోనే ఈ పరిస్థితి ఎదురైనట్లు తెలుస్తోంది. సదస్సుల్లో మండల సర్వేయర్ గోపీనాథ్, వీఆర్వో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై కేసులు

బుచ్చిరెడ్డిపాళెం: నూతన సంవత్సర సందర్భంగా పెనుబల్లి దళితవాడలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘటనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులైన ఐదుగురిపై కేసులను శుక్రవారం నమోదు చేసి జైలుకు తరలించారు. రాజకీయ ఒత్తిళ్లతో మరో వర్గంపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నాగార్జున, చంద్రశేఖర్, సూర్య, కళ్యాణ్, విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

ఘనంగా సీఆర్సీ 9వ వార్షికోత్సవం



వెంకటాచలం: మండలంలోని ఎర్రగుంట వద్ద నున్న దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం (సీఆర్సీ) 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన పారాలింపిక్ స్పోర్ట్స్‌లో విజేతలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎస్‌ఎస్‌ఏ అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి వెంకటసుబ్బయ్య తదితరులు బహుమతులు అందజేశారు.

దాతల సహకారం మరువలేనిది

తోటపల్లిగూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధికి దాతల అందిస్తున్న సహకారం మరువలేనిదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఎన్‌డీఆర్ గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు నాయుడు దశరథరామిరెడ్డి 26వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభావంతులైన పలువురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో దాత నాయుడు ఆదికేశులరెడ్డి స్థానిక నాయకులు బొమ్మి సురేంద్ర, కోడూరు శ్రీనివాసులరెడ్డి, వెంకటనరసారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ధనుంజయ, ఉపాధ్యాయులు ఇంగిలాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారుల అదృశ్యం


నెహమ్యా

విడవలూరు: మండలంలోని ఊటుకూరు ఇందిరా నగర్ కాలనీకి చెందిన ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. ఊటుకూరు ఇందిరానగర్‌కు చెందిన బాలుడు బండి నెహమ్యా తన తల్లితో కలిసి గ్రామంలో నిర్వహిస్తున్న డీజే చూసేందుకు గతేడాది 31వ తేదీ రాత్రి వెళ్లారు. కొద్దిసేపటి అనంతరం ఇంటికి ఆమె వచ్చారు. తన కుమారుడు వస్తాడనే ఉద్దేశంతో నిద్రించారు. ఉదయానికి కనిపించకపోవడంతో బాలుడి తండ్రి చుట్టుపక్కల ఆరాతీసినా ప్రయోజనం లభించలేదు. మరోవైపు అదే గ్రామానికి చెందిన మరో బాలుడు దాసరి సుబ్రహ్మణ్యం సైతం కనిపించడంలేదంటూ తండ్రి శేషయ్య వెతకసాగారు. వీరిద్దరూ ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఆడుకుంటున్నారని పక్కింటి వారు తెలియజేశారు. ఊటుకూరు శివార్లలోని మద్యం దుకాణం వద్ద ఒకటో తేదీన చిన్నారులు కనిపించారని గ్రామానికి చెందిన అనిల్ తెలిపారు. వీరి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు. వీరి ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్లో తెలియజేయాలని కోరారు.

కూలీల సంఖ్య పెంచాలి

- జెడ్పీ సీఈఓ విద్యారమ


రికార్డులు పరిశీలిస్తున్న సీఈఓ

మనుబోలు: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని జెడ్పీ సీఈఓ విద్యారమ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలు ఆదాయవనరులపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పోగుపడే చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు. దానిని రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జలజాక్షి, ఏఓ ముజిబున్నీసా తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను ఆక్రమిస్తే చర్యలు

పొదలకూరు: జిల్లాలో వక్ఫ్ బోర్డు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఖుదావన్ పేర్కొన్నారు. మండలంలోని దుగ్గుంట, పెదరాజుపాళెం, కొనగలూరు, పొదలకూరు మసీదులను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇమామ్, మౌజన్లకు ఇచ్చే గౌరవవేతనం పక్కదారి పడుతున్నట్టు తెలుస్తోందని తమ దృష్టికొస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రెసిడెంట్లు రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. తాటిపర్తి, మహ్మదాపురం గ్రామాల్లో భూములను పరిశీలించారు. కబ్జాకు గురైన భూములను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నోటీసులు అందజేస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్ వెంట మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జమీర్, ఖాదర్‌బాషా తదితరులున్నారు.

నేత్రదానం


మల్లికార్జున్ (ఫైల్)

విడవలూరు: అల్లూరు మండలం నార్త్ ఆములూరుకు చెందిన రావుల మల్లికార్జున్ (52) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల కోరిక మేరకు ఆయన నేత్రాలను విడవలూరుకు చెందిన మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి ఐ టెక్నీషియన్ సునీల్ సేకరించారు.

కాకాణిని కలిసిన నాయకులు


శుభాకాంక్షలు తెలియజేస్తున్న పంటపాళెం నేతలు

ముత్తుకూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని శుక్రవారం నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో పంటపాళెం నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, నాయకులు ప్రభాకర్‌నాయుడు, చెంగారెడ్డి, మనోహరరెడ్డి తదితరులు కాకాణిని కలిసి పూలబొకేలు అందజేశారు.

ప్రభుత్వ మొండి వైఖరి తగదు

విడవలూరు: ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడి ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శి రాము శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంక్రాంతి కానుకగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఐఆర్‌ను ప్రకటించడంతో పాటు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జీఓ నంబర్ 117ను రద్దు చేసి ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలన్నారు.

ధనుర్మాస పూజలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

జ్వరాలు తగ్గే వరకూ మెడికల్ క్యాంప్

- జిల్లా నోడల్ అధికారి దయాకర్


వివరాలు తెలుసుకుంటున్న దయాకర్

పొదలకూరు: తాటిపర్తి గ్రామంలో జ్వరాలు పూర్తిగా తగ్గే వరకూ మెడికల్ క్యాంప్‌ను నిర్వహించాలని జిల్లా ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ దయాకర్ పేర్కొన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో శుక్రవారం వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు నిత్యం సర్వే నిర్వహించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సిబ్బందితోపాటు దయాకర్ ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరా తీశారు. వైరల్ ఫీవర్స్‌ను గుర్తించామని, గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. దోమలను ఉధృతిని తగ్గించాలని, మురుగు కాలువల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని పేర్కొన్నారు. జ్వరాలున్న వారు వెంటనే మెడికల్ క్యాంపునకు వచ్చి పరీక్షలు చేయించుకోవాల్సిందిగా వెల్లడించారు. నోడల్ అధికారి వెంట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నరసింహారావు, డాక్టర్ కె.స్రవంతి, సూపర్‌వైజర్లు కె.శ్రీనివాసులు, ఎం.నరసమ్మ, ఆరోగ్య సహాయకులు మహేంద్ర, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు త్వరలో పరిష్కారం


నాలుగో వార్డులో పర్యటిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజా సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలో గల నారాయణ స్కూల్ వద్ద సిమెంట్ రోడ్డు, స్కూల్ వెనుక వీధిలోని అపార్ట్‌మెంట్ వద్ద డ్రైనేజీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఈ తరుణంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి వార్డును శుక్రవారం సందర్శించారు. అక్కడి రోడ్డు దుస్థితిని గమనించారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ కాలువలను పరిశీలించి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వవ్వేరులో భూ పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం: మండల పరిధిలోని వవ్వేరులో వివాదాస్పద భూమిని జేసీ కార్తీక్ శుక్రవారం పరిశీలించారు. సర్వే నంబర్ 74 / 1, 2 రికార్డుల్లో మార్పు జరిగి ఉండటంపై రైతులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆయన పరిశీలించారు. ఆర్డీఓ అనూష, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక జమీల మహల్, నాజ్ థియేటర్లను ఆర్డీఓ తనిఖీ చేశారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


కొడవలూరు: ఎంఈఓను సత్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు


విడవలూరులో..


వెంకటాచలం: వీఎస్‌యూలో..


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దామరమడుగులో..


ముత్తుకూరు: మ్యాథ్స్ టీచర్‌కు సన్మానం


బుచ్చిరెడ్డిపాళెంలో..


ఇందుకూరుపేటలో..

కొడవలూరు: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- స్త్రీ విద్యకు సావిత్రిబాయి పూలే పునాదులు వేశారని ఎంఈఓ వసంతకుమారి పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతిని యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం వసంతకుమారిని సత్కరించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుట్టయ్య, తిరుపాల్, జిల్లా కార్యదర్శులు జమీర్‌బాషా, శైలజా భారతి, నేతలు జమీర్ అహ్మద్, విశ్వనాథ్, వెంకటేశ్వర్లు, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.
- **విడవలూరు:** స్థానిక పీఆర్‌ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.
- **బుచ్చిరెడ్డిపాళెం:** పట్టణంలోని రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ హాజరయ్యారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు హబీబా, మీనాక్షి, ఝాన్సీ, ఆయేషాను సత్కరించారు. దళిత నేత భీమతాటి వెంకటరమణయ్య, మదిరి శ్రీనివాసులు, తాళ్లూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** దామరమడుగులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు నరసయ్య, ఉపాధ్యాయులు సర్దార్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.
- **ఇందుకూరుపేట:** సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలని కొత్తూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున పేర్కొన్నారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ మహిళా ఉపాధ్యాయురాలు సుబ్బరత్నమ్మను సత్కరించారు.
- **ముత్తుకూరు:** మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి, మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సీనియర్ గణిత టీచర్ సీహెచ్ భారతిని హెచ్‌ఎం తాన్య తదితరులు సన్మానించారు.
- **పొదలకూరు:** పట్టణంలో శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాయిత్రిబాయి పూలే జయంతి జరిగింది. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు వూకోటి లక్ష్మీనారాయణ, తుమ్మల శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో పముజుల శంకరయ్య, తుమ్మల ప్రసాద్, వి.శ్రీనివాసులుగౌడ్, కోడూరు మస్తానయ్య, బి.మురళి, సుధాకర్, శేషయ్య, టి.శ్రీహరి, రమణయ్య పాల్గొన్నారు.
- **తోటపల్లిగూడూరు:** సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మహిళా టీచర్లను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ మాట్లాడుతూ దేశంలోనే ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి అనేక సేవలందించారన్నారు. ఆమె అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, ఎంబేటి సంధ్యారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, గోలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- **వెంకటాచలం:** మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఇన్‌చార్జి వీసీ విజయ భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి బాలికల విద్య, మహిళల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయురాలని కొనియాడారు. ఆమె చేసిన పోరాటాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కో –ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **పొదలకూరు:** స్థానిక నాగార్జున స్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీతారెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గా, డైరెక్టర్ చంద్రశేఖర్, సలహాదారు సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పొదలకూరులో నివాళులు


టీపీగూడూరు మండలంలో..


పొదలకూరు: నాగార్జున స్కూల్లో..

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని పెంచలకోనలోని మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమ పీఠాధిపతి విజయేశ్వరిదేవి శుక్రవారం దర్శించుకొని పూజలు చేశారు. విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, మల్లికార్జున, కామాక్షితాయికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రవచనలు చేశారు. ఆమెతో పాటు పలువురు విదేశీ భక్తులు హాజరయ్యారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ సభ్యుడు శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.

వేడుకగా గంధ మహోత్సవం

పొదలకూరు: పట్టణంలోని వినాయమాన్యంలో శ్రీహజరత్ ఖాదర్‌వలీ 7వ గంధమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి జరిగిర ఈ కార్యక్రమంలో హిందూ, ముస్లింలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.